అమరావతి కథలు

సత్యం శంకరమంచి

# అచ్చోసిన ఆంబోతులు



ఆంబోతు పెద్దబజార్లో మధ్యగా మంచుంది. పొడవైన, విడివైన పెద్దబజార్లో బుసలుకొడ్తూ నందికేశ్వరుడిలా మంచుంది. ఆంబోతు తెల్లగా, ఎత్తుగా మంచుకొండలా వుంది. ఆంబోతుకి అంత కోపం రావడం ఎవ్వరూ చూడలేదు.

పెద్దలు కొందరు "నాయనా! నందీశ్వరా! శాంతించు తండ్రీ!" అంటూ మొక్కుతున్నారు. ఆంబోతు శాంతించినట్టు లేదు. బుసలు ఆగలేదు. మట్టి చిమ్మడం మానలేదు. పెద్ద ముత్తయిదువులు కొందరు గంగడోలు దువ్వి "నందికేశ్వరా కోప మెందుకయ్యా!" అని అంటుంటే తోక విసరడం తగ్గింది కాని, విసవిస తొక్కుళ్ళు తగ్గలేదు. కూర లమ్మేవాళ్ళు తోటకూర నోటికందిస్తే విదిలించి కొట్టేంది. కృష్ణ మంచి నీళ్ళు తెచ్చేవాళ్ళు కావిడ నీళ్ళు ముందు పెట్టి "తాగవయ్యా" అంటే తాగినన్ని తాగి కడవలు తన్నేసింది.

ఊరు వూరంతా కంగారుగా పెద్దబజార్లోకొచ్చి నిలుచున్న సమయాన రంగయ్య తన చిల్లరకొట్టు కెళ్ళడానికి వీథిలోకొచ్చాడు. వీథిలోని జనాన్ని చూసిమరి కొంచెం ముందుకొచ్చాడు రంగయ్య. రంగయ్యని చూసినఆంబోతుఅంతెత్తు ఎగిరింది. కాలసర్పంలా గాలిలో తోక ఆడించింది. చెవులు దద్దరిల్లేటట్టురంకె వేసింది. పాతాళం బద్దల య్యేట్టు నేల తొక్కింది.

పరమ భయంకరంగా తనవైపు పరుగెత్తుకొస్తున్న ఆంబోతుని చూసిన రంగయ్యకు తారెత్తింది. గోచీ వూడిపోతున్నా లెక్కచేయక పరుగు లంకించు కున్నాడు.

ఇంటిదాకా తరిమింది. వాకిటి ముందు మంచుని గిట్టల్తో నేలరాస్తూ హుంకరించడం మొదలెట్టేంది. రంగయ్య సాగిలపడ్డాడు. ఆంబోతు రంకె లాపలేదు. మొత్తుకున్నాడు, లబోదిబోమన్నాడు. ఆంబోతు ఆగ లేదు. కరివేపాకు, కొత్తిమీర పెట్టబోయాడు. వాటిని చూస్తూనే విసిరికొట్టేంది ఆంబోతు. రంగయ్యకు తెలుసు ఆంబోతు ఎందుకొచ్చిందో! ఇంట్లోకెళ్ళి తట్టల్తో తట్టెడు కందులు పోసుకొచ్చి భయం భయంగా ఆంబోతు ముందు పెట్టాడు. ఆ కందులు చూసి ఆంబోతు ఆగింది. ఆ కందులన్నీ తిని తట్ట శుభ్రంగా నాకి పరమ సాధువులా నడిచి వెళ్ళి పోయింది.

ఆ అడ్డెడు కందులు!

ఉదయం సుబ్బమ్మ తీసుకొచ్చినవి. సుబ్బమ్మ ఇంట్లో నూకలు లేవు. దానికి తోడు అల్లుడొచ్చాడు. ఇంకో గతి లేక ఇంట్లో వున్న అడ్డెడు కందులు రంగయ్యకు అమ్మజూపింది. నాలుగు రూపాయిల కందులకి రూపాయి మించి ఇవ్వనన్నాడు. ఇదేం అన్యాయం అంటే కేకలు. ఊళ్ళో అల్లుడున్నాడు. సిగ్గుపడిపోయిన సుబ్బమ్మ అల్లుడికి అన్నం, కూరా వండి తను పస్తుండాలి అనుకుని మారుమాటాడ కుండా ఆ ఒక్క రూపాయి తీసుకెళ్ళింది. ఆంబోతు వెళ్ళిపోయింతర్వాత రంగయ్య తాపీగా వూపిరి పీల్చు కుని పొద్దున్న లాభం గూబలోకొచ్చిందే అని బాధ పడుతూ కొట్టుకెళ్ళాడు. కొట్టు దగ్గర కూర్చుని గల్లాపెట్టెకు దణ్ణం పెట్టుకుని కళ్ళు తెరిచాడో లేదో ఎదురుగా రౌడీ వీరడు నుంచొని వున్నాడు.

రౌడీ వీరడంటే రక్తం తాగుతాడని పేరు. వాడు నెత్తురు తాగాడో లేదో కాని వాడ్ని చూస్తే కాల యముణ్ని చూసినట్టుంది. నల్లతాచులా సన్నగా బారెడు మనిషి. చింతనిప్పల్లాంటి కళ్ళు. ఎప్పుడూ మనిషి వూగుతుంటాడు. తాగి వూగుతున్నాడో, ఆ మనిషి తీరే అంతో తెలియదు కాని, ఆ వూపు చూసి జనానికి గుండె చిక్కబట్టుకుపోతోంది. ఆ వూపు లాగా మాట కూడా సాగదీస్తాడు.

"ఏం రంగయ్యబాబు పది రూపాయిలుంటే ఇస్తావేంటి?" అన్నాడు వీరడు.

"బావుందయ్యోవ్, నిన్ననేగా ఐదు రూపాయిలు తీసుకెళ్ళావ్!" అన్నాడు కంగారుపడ్తూ రంగయ్య.

"నిన్నటికీ ఇవ్వాల్టికీ మధ్యేం బేరాలు వెయ్యలేదా? ఏ రోజు అవసరం ఆ రోజే"

"ఇప్పుడేం లేదు పో! బోణీ కాలేదు"

-"పోనా...పోనా" సూటిగా చూస్తూ అన్నాడు.

వీరడు "రంగయ్యా! ఆ చేపలు పల్లిపేథి చేపలు..." అంతే, రంగయ్య పడిపోయాడు. "ఒరి నీ అమ్మ కడుపు బంగారంగాను, ఎందుకురా గోల-. ఇదుగో పది తీసుకో" అని రొండినుంచి పది. తీసిచ్చాడు. వీరడు ఆ పది రూపాయల్తో గాలిగోపురం లోకి వచ్చి అక్కడున్న బిచ్చగాళ్ళకు తలో రూపా యిచ్చి ఇంటికెళ్ళిపోయాడు.

వీరడి బెడద ఒక్క రంగయ్యకే కాదు. ఊళ్ళో చాలామందికి వుంది. కాల్లో దిగిన తుమ్మముల్లు లాంటివాడు వీరడు. తుమ్మముల్లు తీస్తున్నకొద్దీ విరుగుతుంది.

ఒకసారి బంగారం తాకట్టు పెట్టుకుని అప్పులిచ్చే భూషయ్య దగ్గరకెళ్ళాడు వీరడు.

"భూషయ్యగారూ! అర్జంటుగా అవసరం వచ్చింది. ఓ వంద రూపాయిలు కావాలి"- అని అల్లుడడిగినట్టు అడిగాడు.

"ఆహా- అలాగా! వంద చాలా? ఎవడి తాత సొమ్ము ఇమ్మంటావ్?" అన్నాడు భూషయ్య.

"తాతలు సంపాదిస్తే మేమంతా మీ దగ్గర కెందు కొస్తామండీ? నిన్న రాత్రి సీతాలు నాన్తాదు, బుచ్చెమ్మ చెవి పోగులు ఎంత ఖరీదు చేశారు?" అన్నాడు వీరయ్య.

భూషయ్య నీళ్ళు కారిపోయి "ఒరేయ్! వంద కావలసిందేనా?" అని దీనంగా అడిగాడు. భూషయ్య దగ్గర వంద తీసుకుని సీతాలు కూతు రికీ, బుచ్చెమ్మ కూతురికీ పెళ్ళిళ్ళు జరుగుతుంటే చెరో యాభై పసుపు కుంకుమ కింద చదివించి ఇంటికెళ్ళిపోయాడు. ఇహ లాభంలేదని భూషయ్య, రంగయ్య తీర్మా నించుకుని రహస్యంగా పథకం వేశారు. జగ్గడనే రౌడీని పిలిపించారు. వీరణ్ణి చంపి, కిష్టలో పారేస్తే ఐదొందలిస్తా మన్నారు. సరేనన్నాడు జగ్గడు. డబ్బు తీసు కున్నాడు. తెల్లారేసరికి వీరడి శవం నీళ్ళలో తేలా లన్నారు. "ఓ" అని వెళ్ళిపోయాడు జగ్గడు.

తెల్లారింది. పీడ విరగడైపోయిం దనుకున్నారు ఇద్దరూ.

"భూషయ్యగారూ" వాకిట్లోంచి కేక. అది వీరడి గొంతు. వీరడి దయ్యం కాదుగదా!

భూషయ్య అదిరిపడ్డాడు.

"భూషయ్యగారూ!"

వణికిపోతూ వీథిలోకొచ్చాడు భూషయ్య.

వీరడు నవ్వుతూ "ఐదొందలు కావాలండీ" అన్నాడు.

"ఐదొందలా..." అన్నాడు భూషయ్య

"మరి జగ్గణ్ణి చంపి కిష్టలో తోసెయ్యద్దండీ..."

మారుమాటాడకుండా ఐదొందలిచ్చాడు భూషయ్య.

రంగయ్య ఇంటిముందు ఆంబోతు హూంక రిస్తోంది. గిట్టల్తో నేల తవ్వి చిందరవందర చేస్తోంది.

రంగయ్య నిశ్శబ్దంగా అరబస్తా చేపలు ఆంబోతు ముందు పెట్టాడు.